శిథిలావస్థలో ఓవర్‌హెడ్ ట్యాంకు



శిథిలావస్థకు చేరిన మండల కేంద్రంలోని వాటర్‌ట్యాంకు



పెచ్చులూడి బయటపడిన ఇనుప చువ్వలు

- బయటపడిన ఇనుప చువ్వలు
- దృష్టి సారించని అధికారులు
- ట్యాంకును తొలగించి నూతనంగా నిర్మించాలని స్థానికుల విజ్ఞప్తి

వేలేరు : మండల కేంద్రంలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా కనిపిస్తోంది. గ్రామంలో మంచినీటి కష్టాలు తొలగించేందుకు 55 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం 90 వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంకును నిర్మించింది. అప్పటి నుంచి వాటర్ ట్యాంకు ద్వారా గ్రామస్తులకు నీటి సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు పిల్లర్లు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయపడడంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అలాగే ట్యాంకు లోపలి స్లాబ్ భాగం కూడా పెచ్చూలూడి పడిపోతుండటంతో ట్యాంకును శుభ్రం చేసేందుకు సిబ్బంది జంకుతున్నారు. అలాగే వాటర్ ట్యాంకు పక్కన ఓ ప్రైవేటు వాటర్ ప్లాంట్, చుట్టు పక్కల ఇళ్లు, ప్రధాన రహదారి, ఓ హోటల్ ఉండటంతో నిత్యం పదుల సంఖ్యలో జనం రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ ఎప్పుడు కూలుతుందోనని అక్కడికి వచ్చినవారు ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోని అధికారులు

ప్రమాదకరంగా ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను తొలగించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌ను తొలగించి నూతన వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే దాన్ని తొలగించి నూతన ట్యాంక్ నిర్మించాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

వీల్‌చైర్ క్రికెట్ విజేత అరుణ్‌జాన్ టీం

వరంగల్ స్పోర్ట్స్: యునైటెడ్ వే హైదరాబాద్, కంట్రోల్ ఎస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 20, 21వ తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలి సమీపంలోని అర్బన్‌ఫాం మైదానంలో నిర్వహించిన వీల్‌చైర్ క్రికెట్ టోర్నమెంట్‌లో తెలంగాణ టీం విజేతగా నిలిచింది. రెండు రోజుల పాటు సాగిన టెస్ట్ మ్యాచ్‌లో ఫైనల్‌లో వరంగల్‌కు చెందిన టీం కెప్టెన్ అరుణ్‌జాన్ సారథ్యంలో మహారాష్ట్రపై రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ తెలంగాణ జట్టు విజయం సాధించి విజేత ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరగనున్న టీ -29 నేషనల్ మ్యాచ్‌కు ఎంపికైనట్లు కెప్టెన్ అరుణ్‌జాన్ తెలిపారు.

పురస్కార గ్రహీతకు అభినందన

ఖిలా వరంగల్: పోలీసుల సంస్మరణ -2024 దినోత్సవం సందర్భంగా ఏ సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ ఇన్ సౌండ్ బాడీ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలకు చెందిన సీఎల్ఐ ఎస్.సత్యనారాయణ ప్రతిభ కనబరిచి నగదు పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన ప్రదానోత్సవంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ చేతుల మీదుగా రూ.10వేల నగదు పురస్కారాన్ని సత్యనారాయణ అందుకున్నారు. ఈమేరకు ఆయనను పీటీసీ పరిపాలన భవనంలో పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ (ఎస్పీ), డీఎస్పీలు, అధికారులు శనివారం అభినందించారు.

పోలీస్ క్రీడాకారులకు సన్మానం

వరంగల్ స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీలు షటిల్, బ్యాడ్మింటన్‌లో పతకాలు సాధించిన కట్ల శ్రీనివాస్, వేణును తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్, వేణు 45ప్లస్ డబుల్స్ కేటగిరీలో కాంస్య పతకం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీబీఏ బాధ్యులు కామిడ్రి పవన్, గడ్డం కేశవమూర్తి, పోరిక విజయ్‌కుమార్, కిరణ్, రాజు, వేణు, రఘోత్తమరెడ్డి, శ్రీనివాస్, పూజారి విజయ్, బాలకృష్ణ, సుధాకర్, మహేందర్‌రెడ్డి, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సన్మానం

న్యూశాయంపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలో లేబర్ ఆఫీసర్‌గా ఉత్తమ సేవలు అందించి ఉద్యోగ విరమణ పొంది, ఉమ్రా యాత్ర చేసిన రిటైర్డ్ లేబర్ ఆఫీసర్ మహ్మద్ హబీబుద్దీన్‌ను హమ్ ఖయాల్ - ఏ -వరంగల్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి ఇక్బాల్ దర్ద్, అక్బర్ జియా, ఎస్ఎం.సయిద్, అలీమ్ దానిష్, అమీరుద్దీన్, సాబిర్ ఆలమ్, అక్తర్ హుస్సేన్, హుస్సేన్ పాషా, లతీఫ్, ఫాజిల్ బేగ్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వరంగల్ చౌరస్తా: వరంగల్ రామన్నపేట బట్టల బజారులోని బాలానగర్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 1 నుంచి 6వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాలను శ్రీవారి ఉత్సవ సేవ సమితి ఆధ్వర్యంలో చేపట్టగా సేవా సమితి సభ్యులు గందె గోవిందరాజులు, రవ్వ కృష్ణమూర్తి, పాలారపు కృష్ణమూర్తి, అశోక్, లక్ష్మి, నర్సయ్య, ఆలయ ఈఓ ఎలపాటి రత్నాకర్ రెడ్డి, చైర్మన్ పరాశరం శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వయోపరిమితి పెంపుపై హర్షం

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయోపరిమితి 60 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కేయూ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ సురేష్‌లాల్, డాక్టర్ చిర్ర రాజు శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ రమ, డాక్టర్ శాస్త్రి, డాక్టర్ రాధికారాణి, డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ భారవిశర్మ, డాక్టర్ సీహెచ్.రాజ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వెంకట్ పాల్గొన్నారు.

కేయూలో ఓఎస్‌డీ పదవిని బీసీలకే కేటాయించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఓఎస్‌డీ పదవిని బీసీలకే కేటాయించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేయూ ఇన్‌చార్జ్ ఆరెగంటి నాగరాజు డిమాండ్ చేశారు. కేయూలోని పరిపాలన భవనం వద్ద శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..యూనివర్సిటీల్లో వీసీల నియామకాల్లో బీసీలకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం బాధ్యులు విష్ణు, తిరుపతి, సోమరాజు, శ్వేత, అజయ్‌సింగ్, భీమన్న, రవితేజ, రాజు, రమేష్ చంద్రతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

దర్గాను సందర్శించిన ఏసీపీ



నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లిలో గల హజ్రత్ సయ్యద్ మధార్ షావలి దర్గాను శనివారం పరకాల ఏసీపీ సతీశ్‌బాబు సందర్శించారు. దర్గా చరిత్రను, విశిష్టతను ముతవల్లి మహ్మద్ ఖాజ ఖాద్రిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ క్రాంతి కుమార్, దర్గా నిర్వహకుడు మహ్మద్ ముస్తాషా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కమలాపూర్ : మండలంలోని గూనిపర్తి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఏఈ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్స్ మెయింటెనెన్స్ కారణంగా గూనిపర్తి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గూనిపర్తి, మాదన్నపేట, శ్రీరాములపల్లి, అంబాల గ్రామాల్లో గృహ, వ్యవసాయ విద్యుత్ ఫీడర్లలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

'కొలుగూరికి' సన్మానం

పరకాల : పట్టణంలోని శ్రీకుంకుమేశ్వస్వామి దేవస్థానం చైర్మన్‌గా నియామకమైన కొలుగూరి రాజేశ్వర్‌రావును త్రివర్ణ పేయింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. పేయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ రబ్బాని, గౌరవ అధ్యక్షుడు సంజీవ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమేశ్, కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజేందర్‌కు సన్మానం

ఆత్మకూరు : మండల ప్రత్యేక అధికారిగా విధులు నిర్వర్తించి ఉదోగ్య విరమణ పొందిన రాజేందర్‌ను శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. రాజేందర్ దంపతులను శాలువాలు, పూలమాలతో సత్కరించారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, ఎంపీఓ విమల, కార్యదర్శి శ్వేత, రాజు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ఏర్పాటు



వేలేరు : మండలంలోని శాలపల్లిలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ సహకారంతో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. దీర్ఘకాలికంగా గర్భందాల్చని పశువులను గుర్తించి చికిత్స అందించారు. చూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. దూడలకు నట్టల నివారణ మందులు, కాల్షియం టానిక్ పంపిణీ చేశారు. పాడి పశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నోముల రణధీర్ రెడ్డి, సూపర్ వైజర్ రాజేశ్వర్ రావు, ఏరియా గోపాలమిత్రలు, గోపాలమి త్రలు నరాల సందీప్, రజాక్, కొమురయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఐదుగురిపై అట్రాసిటి కేసు

కమలాపూర్ : స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఐదుగురిపై అట్రాసిటి కేసు నమోదు అయ్యింది. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం పాతర్లపల్లికి చెందిన కొడారి అయిలుకొమురు, కొడారి తిరుపతి, కొడారి స్వరూప, నాల శ్యామల, కమలాపూర్ మండలంలోని మర్రిపల్లిగూడెంకు చెందిన సల్పాల కుమారస్వామి అనే ఐదుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరభద్రరావు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం శివారులో పాతర్లపల్లికి చెందిన నందికొండ రాజుకు చెందిన రెండెకరాల భూమి కోసం ఇటీవల కాల్వ తీస్తున్న క్రమంలో కొడారి అయిలుకొమురు, కొడారి తిరుపతి, కొడారి స్వరూప, నాల శ్యామల, కమలాపూర్ మండలంలోని మర్రిపల్లిగూడెంకు చెందిన సల్పాల కుమారస్వామి అడ్డుకుని రాజును కులం పేరుతో దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కత్తితో దాడి

ఎల్కతుర్తి : మండలంలోని బావుపేట గ్రామంలో పెళ్లి భరాత్‌లో ఘర్షణ చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం మత్తులో ఉన్న పున్నం అనిరుద్ (సిద్దు) డీజే సౌండ్ పెంచాలని ఆపరేటర్ మధుతో గొడవకు దిగాడు. ఈ క్రమంలో పాత గొడవలను దృష్టిలో ఉంచుకుని మధుపై కత్తితో దాడి చేయగా మెడకింది భాగంలో తీవ్ర గాయం అయ్యింది. డీజే యజమాని దాట్ల నరేందర్ అడ్డుపడగా అతడిపై కర్రతో దాడి చేశాడు. దీంతో అతడి చెవి నుంచి రక్తస్రావమైంది. గాయపడిన మధును చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

బాలిక అదృశ్యం

వేలేరు : మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 సంవత్సరాల బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై అజ్మీరా సురేశ్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక 10వ తరగతి పూర్తిచేసి ఇంటి వద్ద ఖాళీగా ఉంటుంది. గతనెల 30వ తేదీన బాలిక తల్లిదండ్రులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసేందుకు మండల కేంద్రంలోని రైతు వేదిక వద్దకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లారు. అయితే ఇంట్లో బాలిక కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. తరిగొప్పుల మండలంలోని అబ్దుల్, నాగారం గ్రామానికి చెందిన బైరగొని శ్రీధర్ అనే వ్యక్తులు తన కూతురిని అపహరించి ఉంటారని అనుమానిస్తూ యువతి తండ్రి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరామర్శ

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్లలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన బుద్దె రాంబాబు కుటుంబాన్ని శనివారం పెరిక సంఘం నాయకులు పరామర్శించారు. ఈ మేరకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. నాయకులు రాజు, ఈశ్వరయ్య, చంద్రశేఖర్, రాజు, శివనాగరాజు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా

- ప్రముఖ వైద్యుడు మార్త రమేశ్



చిత్రపటాలు అందజేస్తున్న డాక్టర్ రమేశ్

నర్సంపేట : పట్టణంలోని మార్కండేయ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రముఖ వైద్యుడు మార్త రమేశ్ తెలిపారు. పట్టణంలోని ఆ కాలనీ కార్యాలయంలో అధ్యక్షుడు పెండెం శివానంద్ ఆధ్వర్యంలో శనివారం మార్కండేయ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు డాక్టర్ రమేశ్ మార్కండేయ, వంశవృక్ష చిత్రపటాలు అందజేసి మాట్లాడారు. సొంత నిధులతో కాలనీని అభివృద్ధి చేసుకోవడం అభినందనీయమని చెప్పారు. కాలనీలో మార్కండేయ ఆలయ నిర్మాణానికి సహాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అసోసియేట్ అధ్యక్షుడు దుస్స శివశంకర్, రాష్ట్ర కార్యదర్శి వలపదాసు శ్యామ్, కాలనీ కార్యదర్శి సుభాశ్, యువజన సంఘం కార్యదర్శి పర్శ శ్రీధర్, తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తక్కళ్లపల్లి ఉమ, సర్వాపురం కార్యదర్శి సిరిమల్లె నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



విద్యార్థులతో విద్యాసంస్థల చైర్మన్ సుబ్బారావు, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు

నర్సంపేట : పట్టణంలోని గీతాంజలి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను మరిపించేలా పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు మాట్లాడారు. ఉపాధ్యాయులు భావిభారత పౌరులగా తీర్చిదిద్దే బాధ్యతతో ముందుకు సాగుతారని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయడంలో ఉపాధ్యాయులు కీలకమన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా బోధించిన తీరును అభినందించారు. డీఈఓగా షిఫా మెహవిన్, ఎంఈఓగా పూజిత, చైర్మన్‌గా అయేషా, ప్రిన్సిపాల్‌గా అక్షితరెడ్డి, ఉపాధ్యాయులుగా 60 మంది వ్యవహరించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గూడూరు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నర్సంపేట : నేషనల్ గ్రీన్ కార్ప్స్ సౌజన్యంతో జిల్లా విద్యాశాఖ, జిల్లా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన భౌతిక శాస్త్ర ఆన్‌లైన్ పోటీల్లో జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థులు రియాజ్ సుల్తానా, అఖిలేశ్వర్, స్పందన, సిరిచందన జిల్లా, మండల స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి ప్రశంసాపత్రాలతోపాటు రూ.3వేల నగదు అందుకున్నారని హెచ్ఎం కాంతారావు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను స్కూల్ ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి హెచ్ఎం కాంతారావు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నైపుణ్యాలను పెంచుకుంటే వ్యర్థాల నుంచి సంపదను సృష్టించడంతోపాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యల పరిష్కారంలో భౌతికశాస్త్రం కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణకుమారి, రాజేశ్, వాణి, రవీందర్‌రెడ్డి, రాధిక, రవి, మల్లయ్య, భాస్కర్, రమేశ్, సుజాత, నిర్మల, పద్మ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు దంత సంరక్షణ కీలకం

వర్ధన్నపేట : గర్భిణులకు దంత సంరక్షణ కీలకమని ప్రముఖ దంత వైద్యనిపుణుడు డాక్టర్ భరత్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో దంత వైద్య విభాగం ఆధ్వర్యంలో గర్భిణుల కోసం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మూర్తి, ఆర్ఎంఓ డాక్టర్ విజయ్‌కుమార్ చేతుల మీదుగా ఆయన మౌత్ వాష్ బాటిళ్లను ఫార్మసీకి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భరత్‌రెడ్డి మాట్లాడారు. గర్భిణులకు నోటి, దంత సంరక్షణ ముఖ్యమన్నారు. నిర్లక్ష్యం చేస్తే పోషకాహార లోపం తలెత్తి తక్కువ బరువులో, అనారోగ్య శిశువులు జన్మించే ప్రమాదం ఉందన్నారు. తప్పనిసరిగా రెండో త్రైమాసికంలో స్త్రీ వైద్య నిపుణుల సలహా మేరకు దంత వైద్యపరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. హార్మోన్ల హెచ్చుతగ్గుల వలన కలిగే ఇన్‌ఫెక్షన్ నివారణ లక్ష్యంగా మౌత్ వాష్‌లు అందిస్తున్నట్లు చెప్పారు. చిగుళ్ల ద్వారా రక్తస్రావం చోటు చేసుకుని ఇబ్బంది పడుతున్న గర్భిణులు వెంటనే వైద్యున్ని సంప్రదిస్తే కారణాన్ని గుర్తించి చికిత్స చేస్తారని తెలిపారు.

మూడు నెలల జీతాలు చెల్లించాలి

- ఈజీఎస్ సిబ్బంది పెన్‌డౌన్



నిరసన తెలుపుతున్న ఈజీఎస్ ఉద్యోగులు

ఐనవోలు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని జాక్ జిల్లా చైర్మన్, ఏపీఓ నక్క కుమారస్వామి ప్రభుత్వాన్ని కోరారు. మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీనికి నిరసనగా జాక్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెన్‌డౌన్ పాటిస్తున్నట్లు వెల్లడించారు. శనివారం ఉపాధి హామీ అధికారులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. గ్రామస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మండలస్థాయిలో అదనపు కార్యక్రమ అధికారి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు, జిల్లాస్థాయిలో హెచ్ఆర్ మేనేజర్, ప్లాంట్ మేనేజర్, డీబీటీ, రాష్ట్రస్థాయిలో ప్రోగ్రాం మేనేజర్లు, టెక్నికల్ వింగ్, క్వాలిటీ కంట్రోల్ వింగ్ అధికారులు 19 సంవత్సరాలుగా పనిచేస్తున్నారన్నారు. వీరందరికీ మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలు ఇవ్వకుండా పనులు చేపించిందని తెలిపారు. ఇటీవల జరిగిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వేలో ఈజీఎస్ అధికారులు, సిబ్బంది భాగస్వాములై పండుగ రోజు కూడా సర్వే చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు పనిచేసి భూమిలేని నిరుపేద కూలీ కుటుంబాల నివేదికను అందించేందుకు తీవ్రంగా శ్రమించారని, కానీ వేతనాలు మాత్రం అందని ద్రాక్షలా మారాయని అన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

'వేల గొంతులు లక్ష డప్పులు'కు తరలిరావాలి



ధర్మసాగర్ : వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్మసాగర్ : ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించతపెట్టిన వేల గొంతులు లక్ష డప్పుల నిరసన కార్యక్రమానికి తరలిరావాలని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కళాకారులు, కళాశాలల, యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు, మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రతిఒక్కరూ భుజాన డప్పుతో తరలిరావాలని అన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు శాంతి సాగర్, అన్వేష్, శంషొద్దీన్, రాజు, సదానందం, ఆల్బర్ట్, శ్రీనివాస్, సూరిబాబు, కుమారస్వామి, రమేశ్, గణేశ్, పోచయ్య, రాజు, అరవింద్, రాజారామ్, శ్రీను, శోభన్‌బాబు పాల్గొన్నారు.

వేలేరు : ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే వేల గొంతులు-లక్ష డప్పులు సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు రాజయ్య, యేసు, ధర్మేందర్, సాంబరాజు, హరిశ్, మల్లయ్య, రాజయ్య, విజేందర్, రాకేశ్, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన వేల గొంతులు- లక్ష డప్పుల సభకు మాదిగలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల స్టీరింగ్ కమిటీ చైర్మన్ ముక్కెర ముఖేష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ప్రజా గ్రంథాలయం ఆవరణలో శనివారం కాంగ్రెస్ నాయకులు వేల గొంతులు- లక్ష డప్పులు వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 07న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భిక్షపతి, కొమురయ్య, సుధాకర్, సురేష్, సుధీర్, వీరస్వామి, పోచయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ రన్నర్స్ సేవలు అభినందనీయం



టీవీ అందజేస్తున్న బెస్ట్ రన్నర్స్ సంస్థ ప్రతినిధులు

దామెర : బెస్ట్ రన్నర్స్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని ఎంఈఓ లకావత్ రాజేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఊరుగొండ ఎంపీపీఎస్ పాఠశాలకు సంస్థ తరపున ఎల్ఈడీ టీవీ, అహూజ కంపెనీ సౌండ్ సిస్టం, డ్యూయల్ డెస్క్ బెంచీలను పంపిణీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. సంస్థ ద్వారా అందించే సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలని అన్నారు. సంస్థ ప్రతినిధులు రమేశ్, శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రమ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, ఉపాధ్యాయులు రేణుక, శ్రీదేవి, సమత, సనీత, జయ, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కండేయుడి శోభాయాత్ర



శాయంపేట : హాజరైన ఎమ్మెల్యే గండ్ర..



ఆత్మకూరు : జయంతి ఉత్సవాలకు హాజరైన భక్తులు

శాయంపేట : పద్మశాలీల ఆరాధ్య దైవం శివభక్త మార్కండేయ మహర్షి జయంతిని శనివారం మండల కేంద్రంలోని శివమార్కండేయ ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు మార్త రాజ్‌కుమార్, అర్చకులు మార్త పవన్‌కుమార్, వంగరి సుధీర్ స్వామివారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మార్కండేయ స్వామి వైభవ వ్రతాన్ని, హోమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం స్వామివారిని పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరు కాగా ఆలయ ప్రధాన అర్చకుడు రాజ్‌కుమార్, అర్చకులు పవన్‌కుమార్, సుధీర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజేస్ అడ్వైజరీ మెంబర్ బాసాని చంద్రప్రకాశ్, మాజీ సర్పంచ్ కందగట్ల రవి, చేనేత సొసైటీ పీఏసీ చైర్మన్ మామిడి శంకర్‌లింగం, పీఏసీ మెంబర్లు బూర లక్ష్మీనారాయణ, రంగు ఆనందం, దాసరి సమ్మయ్య, దిడ్డి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలో శనివారం మార్కండేయ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం మార్కండేయ జయంతిని నిర్వహించారు. వేదబ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుర వీధుల్లో శోభాయాత్ర చేపట్టారు. రాష్ట్ర కమిటీ బాధ్యుడు శివశంకర్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మల్లయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి రాజేందర్, జిల్లా యూత్ అధ్యక్షుడు యాదగిరి, పద్మశాలి మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల ప్రధానకార్యదర్శి ప్రవీణ్, మండల ఉపాధ్యక్షులు రవీందర్, దేవరాజు, కోశాధికారి ప్రసాద్, మండల యూత్ అధ్యక్షుడు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

దామెర : బాధిత కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాద్ అన్నారు. మండలంలోని కోగిల్వాయికి చెందిన రేగుల శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. కాగా విషయం తెలుసుకున్న ఆయన శనివారం మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలిపి ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకులు చందర్, మహేందర్, స్పందన, రవి, వేణు, సమ్మయ్య, శ్రీలత, సాంబయ్య, ప్రవీణ్, సతీష్, రఘు, రాజు, రమేశ్ పాల్గొన్నారు.